క్లుప్తంగా

వడదెబ్బపై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి

నింద్ర: ప్రజలు వడదెబ్బ పట్ల జాగ్రత్తగా ఉండాలని మండల వైద్యాధికారులు సుమలత, వినీషా అన్నారు. మంగళవారం స్థానిక వైద్యశాలలో ఆశా డే సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామాల్లో ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు వడదెబ్బపై అవగాహన కల్పించాలని అన్నారు. నీరు ఎక్కువగా, మజ్జిగ, నిమ్మరసం, ఓఆర్ఎస్ నీరు తాగడం చేయాలన్నారు. అధికంగా కాటన్ దుస్తులు వాడాలని సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ గోపి, సీహెచ్‌ఓ శ్రీదేవి, ఆరోగ్య పర్యవేక్షకులు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రక్రియ పరిశీలన



బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్

నగరి: నియోజకవర్గంలో ఎన్నికలకు సంబంధిత ప్రక్రియను ఎన్నికల అబ్జర్వర్ కైలాస్ వాంగ్డే పరిశీలించారు. పుత్తూరు బాలికల జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో బ్యాలెట్ ఓటింగ్‌ను పరిశీలించారు. అనంతరం నగరిలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలించి భద్రత ఏర్పాట్లపై ఆరాతీశారు. అనంతరం సరిహద్దు చెక్‌పోస్టు వద్దకు వెళ్లి అక్కడ తనిఖీలు నిర్వహించే ప్రక్రియను పరిశీలించి కొన్ని వాహనాలను తనిఖీ చేశారు. ఎన్నికల నిర్వహణలో ఎలాంటి లోటు లేకుండా చూసుకోవాలని ఎన్నికల అధికారి ఆర్డీఓకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు

చిత్తూరు రూరల్(కాణిపాకం): స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని డీఎంహెచ్‌వో ప్రభావతిదేవి హెచ్చరించారు. చిత్తూరు నగరంలోని తన కార్యాలయంలో మంగళవారం స్కానింగ్ సెంటర్ నిర్వాహకులు సమావేశం నిర్వహించి మాట్లాడారు. పీసీపీఎన్‌డీటీయాక్ట్ ప్రకారం గర్భిణులకు స్కానింగ్ చేయాలన్నారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేస్తే కఠిన చర్యలు తీవ్రంగా ఉంటాయన్నారు. జరిమానాతో పాటు కేసులుంటాయన్నారు. రిజిస్ట్రేషన్ లేకుండా స్కానింగ్‌లు చేయకూడదన్నారు. కచ్చితంగా రిజిస్ట్రేషన్‌తో స్కానింగ్ సెంటర్లను నిర్వర్తించాలని ఆమె పేర్కొన్నారు. కార్యక్రమంలో డాక్టర్ హర్షవర్ధన్, రామ్మోహన్ పాల్గొన్నారు.

భాష్యకార్ల ఉత్సవాలు ప్రారంభం



గ్రామోత్సవంలో భాష్యకార్లు

నారాయణవనం: పద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరసామి ఆలయంలో పది రోజులపాటు భాష్యకార్ల ఉత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం భాష్యకార్లు తిరుచ్చిపై మాడవీధుల్లో విహరించారు. ఉత్సవాల్లో మంగళవారం ఉదయం సుప్రభాత సేవతో నిత్య పూజా కైంకర్యాలు జరిపారు. సాయంత్రం తిరుచ్చిపై భాష్యకార్లు మాడవీధుల్లో విహరించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీధర్‌భట్టాచార్య మాట్లాడుతూ విశిష్టాద్వైతాన్ని వ్యాప్తిలోకి తెచ్చిన వారిలో భాష్యకార్లు ప్రముఖులని అన్నారు.

దళితుల నిరసన



ర్యాలీగా వెళ్తున్న దళితులతో గాయత్రీదేవి

చిత్తూరు కార్పొరేషన్: ఎస్సీ ఎస్టీలపై టీడీపీ అభ్యర్థి గురజాల జగన్‌మోహన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ, దళితులు నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకులు డేవి డ్ ఆధ్వర్యంలో, పార్టీ మహిళ విభాగం మాజీ అధ్యక్షురాలు గాయత్రీదేవి అధ్యక్షతన మంగళవారం ఇరువారం సర్కిల్ వద్ద రోడ్డుపై బైఠాయించారు. వారు మాట్లాడుతూ బడుగులను చులకనగా చూస్తూ అహంకార ధోరణితో మాట్లాడటం సరికాదన్నారు. డబ్బులు ఎక్కువగా ఉన్నాయన్న ధీమాతో ఇష్టారాజ్యంగా మాట్లాడితే ప్రజలు చూస్తూ ఊరుకోరని చెప్పారు.

టీడీపీ కవ్వింపు చర్యలు

అనంతరం ర్యాలీగా బయలుదేరుతుండగా పక్క డివిజన్ల నుంచి వచ్చిన టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్‌సీపీ ప్రచార రథానికి అడ్డంగా బైక్ పెట్టి కవ్వింపు చర్యలకు దిగారు. దారి ఇవ్వాలని కోరగా ఇవ్వకపోవడంతో వాగ్వాదం చోటుచేసుకుంది. అందరూ గుంపులుగా చేరడంతో ఘర్షణ వాతావరణం ఏర్పడింది. పోలీసులు ఇరువురికి నచ్చచెప్పడంతో విషయం సద్దుమణిగింది.

కొత్త చేరికలతో టీడీపీలో ముసలం

- టీడీపీ బలపడిందంటూ గాలి మేడలు కడుతున్న ఆ పార్టీ అభ్యర్థి
- ఇప్పటివరకు పార్టీలో బలమైన నేతలు లేరా అంటూ టీడీపీ నేతల ఆగ్రహం
- టీడీపీ నేతల ప్రయాసను చూసి నవ్వుకుంటున్న ప్రజలు
- వెన్నుపోటుదారులంతా వెన్నుపోటు నాయకుడి పార్టీలోనే చేరారు
- ఎంతమంది ఏకమైనా తమను ఢీకొట్టలేరంటున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



నగరి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అసంతృప్త నేతలు కొందరు టీడీపీతో జత కట్టడంతో ఆ పార్టీ ఊహల పల్లకిలో తేలియాడుతోంది. అక్కడి నుంచి కొందరు నేతలు రావడంతో పార్టీ బలపడింది వచ్చిన వారే పార్టీని గెలిపించేస్తారు అంటూ గాలిమేడలను ఆ పార్టీ అభ్యర్థి కట్టేస్తున్నారు. అయితే ఇన్నాళ్లూ పార్టీని తమ భుజస్కందాలపై మోసిన టీడీపీ నేతలు ప్రస్తుత పరిణామాలను అంగీకరించలేక పోతున్నారు. దీంతో పార్టీలో అంతర్గత ముసలం ఏర్పడింది. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన అసంతృప్త నేతల చేరికతో టీడీపీ బలపడిందని ఆ పార్టీ నేత చంకలు గుద్దుకుని సంబరపడిపోతుంటే అప్పటివరకు పార్టీలో ఉన్న నేతలు జీర్ణించుకోలేక పోతున్నారు. టీడీపీ ఇప్పుడు బలపడింది అంటే ఇప్పటివరకు టీడీపీ బలహీనంగా ఉందా? మనమంతా అంతటి లీడర్లు కాదా? ముఖ్యనాయకులని చెప్పుకునే వీరందరూ లోకల్ ఎలక్షన్స్‌లో రెబల్స్‌గా పోటీచేసి బొక్కబోర్లా పడినవారే కదా అంటూ టీడీపీ నేతలు నవ్వుకుంటున్నారు. మొదలియార్ సామాజిక వర్గం నుంచి ఒక నేత వచ్చేస్తే ఆ వర్గమంతా వచ్చేస్తుందా? ఇంకో రెడ్డి వస్తే రెడ్డి వర్గం, రాజు వచ్చేస్తే రాజులందరూ వచ్చేస్తారా? అట్టా వచ్చేట్టుంటే ఇప్పటికే మన పార్టీలో ఉన్న మొదలియార్లకు, రెడ్లకు, రాజులకు అంత సత్తా లేదా? ఆ ఐదుగురే పార్టీని అంతగా గెలిపించే వారైతే ప్రజలను ఓట్లడగడం ఎందుకు వారి చుట్టూ తిరిగితే సరిపోదా అంటూ తమ కోపాన్ని ప్రదర్శిస్తున్నారు. వీరంతా వచ్చేస్తే రోజా ఒంటరిదైపోతుందని పగటి కలలు కంటున్న నేతలకు వారు రెబల్‌గా పోటీచేసినా నియోజకవర్గంలోని అన్ని స్థానాలను ఆమె ఒంటరిగా గెలుచుకురావడం మరచిపోయారా అంటూ బహిరంగంగా చర్చించుకుంటున్నారు. వచ్చిన వాళ్లంతా అక్కడ అన్ని పదవులు అనుభవించి, సంపాదించి పబ్బం గడుపుకున్న వారే కదా? వారేమైనా ప్రజలకు అన్యాయం జరిగిందని, తమ గ్రామంలో అభివృద్ధి జరగలేదని వస్తున్నారా ? స్వార్థ ప్రయోజనాల కోసం పిలవని పేరంటానికి వడ్డింపులకు వచ్చినవారిలా తమంతట తామే వచ్చి కలుసుకుంటున్నారు.

అంతా స్మగ్లర్లే కదా ఉండేది..!

పదవులు అనుభవించినా పార్టీలు మారుతున్న వీరు మన పార్టీపైనో, పార్టీనేతపైనో ఉన్న అభిమానంతో ఇక్కడకు రావడం లేదని మన పార్టీ అధిష్టానానికి తెలియదా? అంటూ మనసులోని మాటలను బయటపెడుతున్నారు. మనవాళ్లు వారికిచ్చే బిల్డప్ నిజమే అయితే గత ఎన్నికల్లో రోజా 40 వేల మెజారిటీతో గెలిచి ఉండాలి కదా? ఎంత మనకు గెలిచేంత బలం లేకపోతే మాత్రం పార్టీలో ఉన్న నాయకులను నమ్మక అద్దెకు నాయకులను తీసుకురావడం మాకైతే నచ్చలేదబ్బా అంటూ నేతల వైఖరిని తప్పుబడుతున్నారు. కొందరు టీడీపీ నేతలు మాత్రం అభ్యర్థికి వంత పాడుతూ మన అభ్యర్థి అందరికీ ఏకతాటిపై తీసువచ్చాడు అని అంటుంటే అవునా అయితే అశోక్ రాజు ఎందుకు పార్టీ వదలి వెళ్లిపోయినట్టు, పార్టీ మాజీ అధ్యక్షుడు పాకా రాజా ఎక్కడా కనిపించరే? జిల్లా పార్టీ మాజీ అధ్యక్షుడు రమేష్‌నాయుడు జాడేది? ఇదా ఏకతాటిపై తీసుకురావడం అని టీడీపీ శ్రేణులే ప్రశ్నిస్తుంటే అది విన్న వైఎస్సార్‌సీపీ నేతలు అవును టీడీపీ అభ్యర్థి అందరినీ ఏకతాటిపై తీసుకురావడం నిజమే అంటున్నారు. ఇదివరకు గంజాయి స్మగ్లర్లు, బియ్యం స్మగ్లర్లు, ఎర్రచందనం స్మగ్లర్లు, ఇసుక స్మగ్లర్లు అంటూ విడివిడిగా ఉండేవారని వారందరికీ పసుపు కండువాలు కప్పి భానుప్రకాష్ ఏకతాటిపై తీసుకువచ్చాడని అంటున్నారు. అలాగే వెన్నుపోటుకు జన్మస్థలమైన టీడీపీకే వెన్నుపోటుదారులందరినీ తీసుకువచ్చారని ఎద్దేవా చేస్తున్నారు. 17 కేసులు ఉన్నట్లు చూపిన ఆయనెక్కడ, నేరచరితలేని మా రోజమ్మ ఎక్కడ అంటూ ధీమా ప్రదర్శిస్తున్నారు. రోజమ్మను ఓడించడానికి వ్యూహాలు రచిస్తున్నాం, పథకాలు రచిస్తున్నాం అంటున్నారని టీడీపీ నేతలు, వెన్నుపోటు నేతల వ్యూహాలకు భయపడిపోవడానికి రోజమ్మ పిల్లలు ఆడుకునే బుజ్జిబొమ్మ కాదని వారి భరతంపట్టే జేజమ్మ అని అంటున్నారు.

అభివృద్ధిని చూసి ఆదరించండి



బీసీ కాలనీలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న కృపాలక్ష్మి

- కార్వేటినగరం రూపురేఖలు మార్చేస్తా
- ఇంటింటా మంగళ హారతులతో ఘన స్వాగతం

కార్వేటినగరం: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి చేసిన అభివృద్ధిని చూసి తనను ఆదరించాలని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కళత్తూరు కృపాలక్ష్మి అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని బీసీ కాలనీ, ముస్లిం కాలనీ, పాత సంతవీధి, బొందువీధి, శివాలయం వీధి, త్యాగరాజుపల్లె వీధుల్లో ఎంపీపీ లత, సర్పంచ్ ధనుంజయవర్మ ఆధ్వర్యంలో ప్రతిభా గాంధీతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి మాట్లాడుతూ నియోజకవర్గాన్ని సీఎం జగనన్నకు దత్తత ఇచ్చి మరో పులివెందులగా అభివృద్ధి చేశారని, అలాగే కార్వేటినగరాన్ని తన తండ్రి దత్తతకు తీసుకుని రూ.70 కోట్లతో అభివృద్ధి చేసి సుందర నగరంగా తీర్చిదిద్దారని తెలిపారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అన్ని సామాజిక వర్గాల అభివృద్ధికి సంక్షేమ పథకాలు అందించి పేదవాన్ని ధనవంతులుగా చేశారన్నారు. కార్వేటినగరం ప్రసిద్ధ స్కంధ పుష్కరిణిలో సిరాలి మండపం నిర్మాణం, సుబ్రమణ్యస్వామి ఆలయ ఆధునీకరణ, టీటీడీ కల్యాణ మండపంలో అదనపు గదులు, కాశీవిశ్వేశ్వర ఆలయం ఆధునీకరణ వంటి వాటితో పాటు ప్రతి వీధికి సీసీ రోడ్లు నిర్మించారని తెలిపారు. అదేవిధంగా పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు అందించడానికి 50 పడకల ఆస్పత్రిని తీసుకొచ్చిన ఘనత తన తండ్రికే దక్కుతుందన్నారు. ఆయన అభివృద్ధి పనులను గుర్తించి, మీ ఆడబిడ్డగా ఆదరించి ఫ్యాన్ గుర్తుపై రెండు ఓట్లు వేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు.



ముస్లిం కాలనీలో ప్రతిభాగాంధీ, ఎంపీపీ లతను గజమాలతో సన్మానిస్తున్న పార్టీ శ్రేణులు

బ్రహ్మరథం పడుతున్న నగరవాసులు

కార్వేటినగరంలోని ముస్లింకాలనీ, బీసీ కాలనీ, కొల్లాపురమ్మ బీసీ కాలనీ, శివాలయం వీధుల్లో నిర్వహించిన ఎన్నికల ప్రచారానికి ఆయా కాలనీ వాసులు స్వచ్ఛందంగా తరలివచ్చి బ్రహ్మరథం పట్టారు. ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మికి ఇంటింటా మంగళ హారతులు పట్టి గజమాలలతో ఘనంగా స్వాగతించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, కోఆప్షన్ మెంబర్ పట్నం ప్రభాకర్‌రెడ్డి, ఉప సర్పంచ్ శేషాద్రి, కట్ల రవిరెడ్డి, దొరబాబు, మురళి, ధనశేఖర్‌యాదవ్, శివప్రకాష్‌మొదలి, అంబిక, మోహనమ్మ, గిరిజ, ధనశేఖర్ మొదలి, గోపి, ప్రభాకర్, దాముదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జగనన్నలా మంచి చేసే సీఎం లేరు





మంత్రి రోజాకు పూలతో స్వాగతం పలుకుతున్న మహిళలు, ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి రోజా

- ఫ్యానుకు ఓటు.. పథకాల పట్టు
- సైకిల్‌కు ఓటు.. ప్రజలకు చేటు
- ఎన్నికల ప్రచారంలో మంత్రి ఆర్‌కే రోజా

పుత్తూరు: దేశంలోనే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిలా ప్రజలకు మంచి చేసే ముఖ్యమంత్రి మరొకరు లేరని మంత్రి, నగరి ఎమ్మెల్యే అభ్యర్థి ఆర్‌కే రోజా అన్నారు. ఫ్యానుకు ఓటు వేస్తే సంక్షేమ పథకాలు మీ చుట్టూ తిరుగుతాయని, అదే సైకిల్‌కు ఓటు వేస్తే పథకాలు ఎక్కడా అంటూ వారి వెంట తిరగాల్సి వస్తుందని స్పష్టం చేశారు. మంగళవారం మున్సిపాలిటీలోని 3వ వార్డు నుంచి 10వ వార్డు వరకు మంత్రి రోజా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మంత్రికి అడుగడుగునా ప్రజలు బ్రహ్మరథం పట్టారు. గత ఐదేళ్లలో అందించిన సంక్షేమ ఫలాలు, చేసిన అభివృద్ధిని వివరిస్తూ ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అమలవుతున్న సంక్షేమం, జరుగుతున్న అభివృద్ధి కొనసాగాలంటే జగనన్నను మరోసారి సీఎంను చేసుకోవాలని పిలుపునిచ్చారు. ప్రజల మద్దతు కూడగట్టుకున్న వైఎస్సార్‌సీపీని ఒంటరిగా ఢీకొట్టలేమని తెలుసుకున్న చంద్రబాబు జనసేన, బీజేపీతో కూటమి కట్టారని చెప్పారు. అంతర్గతంగా కాంగ్రెస్‌తోనూ లాలూచీ పడ్డాడని ఆరోపించారు. అయినా లాభం లేదని మేనిఫెస్టోలో సాధ్యం కాని హామీలు గుప్పించి ప్రజలను మోసం చేయడానికి ఊరూరా తిరుగుతున్నారని తెలిపారు. విశ్వసనీయతను కూడగట్టుకున్న వైఎస్సార్‌సీపీ వెంటే ప్రజలు ఉన్నారని, నగరి నుంచి తనను ముచ్చటగా మూడోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు రాధ, జయలక్ష్మి, హేమలత, భానుమతి, కుప్పమ్మ, షకీలా, నరసింహారావు, పవన్, నాయకులు జయచంద్రన్, లత, తిరునావక్కరుసు, లారీమోహన్, శివారెడ్డి, జయరామిరెడ్డి, చక్రి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు



మంత్రి రోజా సమక్షంలో చేరిన ఇలంగోవన్, టీడీపీ నాయకులు

పుత్తూరు: మున్సిపాలిటీ 4వ వార్డుకు చెందిన టీడీపీ సీనియర్ నాయకులు ఇలంగోవన్‌తో పాటు సహచర 50 కుటుంబాలకు చెందిన టీడీపీ నాయకులు మంగళవారం పర్యాటక శాఖ మంత్రి ఆర్కే రోజా సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. మంత్రి రోజా వారికి కండువాలు కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన ఇలంగోవన్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలు, చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై పార్టీలో చేరినట్లు తెలిపారు. జగనన్న సైనికురాలిగా పనిచేస్తున్న మంత్రి రోజమ్మతో కలిసి నడవడానికి నిర్ణయించుకున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారిలో వెంకటేష్, బాలాజీ, గోపి, దాము, శివ, గుణశేఖర్, ప్రవీణ్‌రెడ్డి, ఉష, దేవిక, దేవి, దినేష్, ప్రవీణ్ బాబు, భాస్కర్, తరుణ్, దీపక్, కన్నన్, భువనేశ్వరి తదితర కుటుంబాల వారు ఉన్నారు.

స్ట్రాంగ్ రూమ్ పరిశీలన



జీడీనెల్లూరులో స్ట్రాంగ్ రూమును పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ షణ్మోహన్



నగరి: స్ట్రాంగ్ రూమ్ వద్ద తహసీల్దార్‌తో చర్చిస్తున్న కలెక్టర్

గంగాధరనెల్లూరు: గంగాధరనెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూములను ఎన్నికల అబ్జర్వర్ కైలాస్ వాంఖేడ్, జిల్లా కలెక్టర్ ఎస్.షణ్మోహన్ మంగళవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి వెంకటశివను ఏర్పాట్ల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం గంగాధరనెల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమును పరిశీలించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఆర్‌వో రవి, నోడల్ ఆఫీసర్ పుష్ప కుమారి, డీటీ తులసిరామ్, ఎన్నికల డీటీ విజయకృష్ణ, మండల సర్వేయర్ గణేష్ పాల్గొన్నారు.

నగరిలో..

నగరి: నగరి డిగ్రీ కళాశాల సమీపంలో ఉన్న ఇండోర్ స్టేడియంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను మంగళవారం జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ఎస్.షణ్మోహన్ పరిశీలించారు. తహసీల్దార్ చంద్రశేఖర్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. భద్రతా అంశాలపై అధికారులతో చర్చించారు. ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూసుకోవాలని సూచించారు.

టీడీపీ ప్రచారం.. జనాలకు నరకం

- జనం ఎక్కువమంది కనపడాలని ట్రాఫిక్‌ను స్తంభింపజేసిన పచ్చతమ్ముళ్లు
- 108 వాహనానికి కూడా దారి ఇవ్వని వైనం





జాతీయ రహదారిపై ట్రాఫిక్‌ను స్తంభింపజేసిన తెలుగు తమ్ముళ్లు, ట్రాఫిక్‌లో చిక్కుకున్న 108 వాహనం

గంగాధర నెల్లూరు: మండల కేంద్రంలో టీడీపీ ఎన్నికల ప్రచారం సందర్భంగా తెలుగు తమ్ముళ్ల అత్యుత్సాహం ప్రయాణికులను అవస్థలకు గురిచేసింది. తెలుగుదేశం పార్టీ అభ్యర్థి థామస్ ఎన్నికల ప్రచారం సందర్భంగా జీడీ నెల్లూరు మండల కేంద్రంలో తెలుగు తమ్ముళ్లు చిత్తూరు–పుత్తూరు జాతీయ రహదారిపై బాణాసంచా పెట్టి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించి, భారీగా వాహనాలను స్తంభింపజేశారు. దారి పొడవునా టపాసులు పేల్చడంతో సంతకు వచ్చిన వారు సైతం ఇబ్బంది పడ్డారు. అదే సమయంలో అటువైపుగా వస్తున్న అత్యవసర 108 వాహనానికి కనీసం దారి ఇవ్వకుండా ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించారు. దీంతో జనం వారి తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

టీడీపీ ప్రచారంలో స్థానికులు నిల్

శ్రీరంగరాజపురం: తమ గ్రామానికి టీడీపీ ఏమి చేసింది ? అని 49 కొత్తపల్లిమిట్ట గ్రామస్తులు టీడీపీ ఇన్‌చార్జ్ థామస్‌ను నిలదీశారు. మండలంలోని 49 కొత్తపల్లిమిట్ట దళితవాడలో మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి థామస్, టీడీపీ ఎంపీ అభ్యర్థి దగ్గుమళ్ల ప్రసాద్‌రావు, చిత్తూరు మాజీ ఎమ్మెల్యే సీకే బాబు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ ప్రచారానికి చిత్తూరు నుంచి డబ్బులు ఇచ్చి జనసమీకరణ చేశారు. చిత్తూరు వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి విజయానందరెడ్డి సొంత గ్రామం కావడంతో ఈ పంచాయతీపై టీడీపీ ఇన్‌చార్జ్ ప్రత్యేక శ్రద్ధ వహించారు. కానీ స్థానికుల నుంచి స్పందన లేకపోవడంతో వెనుదిరిగారు. అయితే వారి ప్రచారానికి స్థానికులు వ్యతిరేకతను వ్యక్తం చేశారు. వారి రాకను నిరసిస్తూ నిరసన వ్యక్తం చేశారు. వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మి ముద్దు.. థామస్ వద్దు అని నినాదాలు చేశారు. అయితే శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎస్‌ఐ రాజా కుళ్లాయప్ప కేంద్ర బలగాలతో పహారా నిర్వహించారు.



బయటి వ్యక్తులతో ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులు

సంక్షేమం కావాలంటే జగనన్న రావాలి



ఎన్నికల ప్రచారంలో రామ్‌ప్రసాద్ రెడ్డి

నగరి: సంక్షేమం కొనసాగాలంటే వైఎస్సార్ కాంగ్రెస్ అధికారంలో ఉండాలని మంత్రి ఆర్కేరోజా సోదరులు రామ్‌ప్రసాద్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అయనంబాకంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ వెళ్లి నియోజకవర్గంలో చేపట్టిన అభివృద్ధిని వివరించారు. మరో ఐదేళ్లు రాష్ట్రం సుభిక్షంగా ఉండాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓటువేసి రోజమ్మను, జగనన్నను గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ భార్గవి, అర్బీకే చైర్మన్ బుజ్జిరెడ్డి, మండల కన్వీనర్ సుదర్శన నాయుడు, సచివాలయ కన్వీనర్ హరి, వైస్ ఎంపీపీ కన్నియప్ప, నాయకులు గణపతి శెట్టి, దామునాయుడు, చంద్రారెడ్డి, సత్య తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం కాంక్షించే నేత జగనన్న





టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో తులసి యాదవ్, అన్బళగన్, ఫ్యాన్ గుర్తుకు ఓటేయాలని అభ్యర్థిస్తున్న రాష్ట్ర సంయుక్త కార్యదర్శి హేమసుందర్‌రెడ్డి

పాలసముద్రం: ప్రజల సంక్షేమం గురించే ఆలోచించే ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న మాత్రమే అని మండల కన్వీనర్ తులసి యాదవ్, జెడ్పీటీసీ సభ్యుడు అన్బళగన్ అన్నారు. మంగళవారం బలిజకండ్రిగలో వారు ఎన్నికల ప్రచారంలో భాగంగా ఇంటింటికీ వెళ్లి ఎమ్మెల్యే అభ్యర్థి కృపాలక్ష్మిని గెలిపించాలని కోరారు. పాలసముద్రానికి చెందిన టీడీపీ నాయకులు గజేంద్ర యాదవ్, చిరంజీవి, సుధాకర్, బలిజకండ్రిగ దళితవాడకు చెందిన మూర్తి, మణిగండన్, కేజే పురానికి చెందిన శక్తివేల్, వెంకటేష్, అర్జున్ తమ అనుచరులతో కలిసి 50 కుటుంబాలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి తులసియాదవ్, అన్బళగన్ పార్టీ కండువాలు వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ గోవిందరాజ్, మాజీ ఎంపీటీసీ షణ్ముగం, మాకయ్య, పద్మనాభ నాయుడు, షణ్ముగరెడ్డి, సుబ్రమణ్యం, కుమార్, గోపాల్, రవి రెడ్డి, విష్ణు, ఆర్ముగం, శీను మందడి, తదితరులు పాల్గొన్నారు.

వెదురుకుప్పంలో..

వెదురుకుప్పం: సంక్షేమ ప్రభుత్వాన్ని మరోమారు ఆశీర్వదించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి బండి హేమసుందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని జక్కిదొన గ్రామ సచివాలయ పరిధిలో ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. అదేవిధంగా పచ్చికాపల్లం, నల్లవెంగనపల్లె, పాతగుంట, వెదురుకుప్పం, బ్రాహ్మణపల్లె, పెరుమాళ్లపల్లె, తిరుమలయ్యపల్లె, బొమ్మయ్యపల్లె, ఆళ్లమడుగు, మాంబేడు, కొమరగుంట గ్రామ సచివాలయాల పరిధిలో ఆయా పార్టీ నాయకులు విస్తృతంగా ప్రచారం చేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పద్మనాభరెడ్డి, జెడ్పీటీసీ సుకుమార్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.